# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించండి

*అధికారులకు ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ ఆదేశం*

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): జిల్లాలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం తన చాంబర్‌లో ఎంసీసీలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల లొకేషన్లు, ఎన్నికల వ్యయంపై జిల్లా ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్ సమీక్షించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు, పోలీస్ శాఖ సీజ్ చేసిన మొత్తాన్ని జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారా విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని రొనాల్డ్ రాస్ సూచించారు. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువ మొత్తంలో పట్టుబడిన నగదును ఆదాయ పన్ను శాఖకు పంపించి అక్కడి నుంచి విడుదల చేసేందుకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ సంబంధిత మొత్తాన్ని తిరిగి జిల్లా ఫిర్యాదుల కమిటీ ద్వారానే విడుదల చేయాలని భారత ఎన్నికల కమిషన్ ఎస్ఓసీ జారీ చేసినట్లు తెలిపారు. వివిధ నిఘా బృందాలు సీజ్ చేసిన మొత్తాన్ని నియోజకవర్గాల వారీగా నివేదిక అందజేయాలని ఎంసీసీ నోడల్ అధికారికి సూచించారు. సీజ్ చేసిన మొత్తంలో జిల్లా ఫిర్యాదుల కమిటీ విడుదల చేసిన మొత్తం వివరాలు అందజేయాలని ఆదేశించారు.

### సమస్యలున్న పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

సమస్యాత్మక(వల్నరబుల్) పోలింగ్ కేంద్రాల లొకేషన్లను గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని గుర్తించారో వాటిని పునరాలోచించి ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు మరోసారి వాటి లొకేషన్లను గుర్తించాలన్నారు. నవంబర్ 3వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో నియోజకవర్గ స్థాయిలో పోలీస్ బందోబస్తు ఉన్నందున పోలీస్ సిబ్బందిని నియమించాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. పోలీస్ శాఖలో ఎన్నికల విధులు నిర్వహించే వారికి పోస్టల్ బ్యాలెట్ పంపిణీకి ఏర్పాట్లు చేయాలని కోరారు. అంతేకాకుండా ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌లో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని రొనాల్డ్ రాస్ సూచించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్యా, అదనపు పోలీస్ కమిషనర్ లా అండ్ ఆర్డర్ విక్రమ్ సింగ్‌మాన్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్ రెడ్డి, అడిషనల్ కమిషనర్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి రొనాల్డ్ రాస్

### *కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన అధికారులు*

జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ హైదరాబాద్ సీపీ సందీప్ శాండిల్య, లా అండ్ ఆర్డర్ అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్‌లతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్ చెక్‌పోస్ట్‌ల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాలకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పరిశీలించారు. అదే విధంగా సువిధ సెంటర్, ఈవీడీఎం ఆఫీస్‌లో ఏర్పాటు చేసిన ఎంసీసీ, ఎంసీఎంసీ కంట్రోల్ రూంలను పరిశీలించారు.

## రూ.30 లక్షల హవాలా నగదు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న హవాల నగదు

చార్మినార్, అక్టోబర్ 28: పాతబస్తీలో గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతున్న హవాలా నగదును దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్ ప్రాంతానికి చెందిన గంటయాల శ్రీనివాస్‌రావు (60) శ్రీశైలంగౌడ్(50)తోపాటు న్యూబోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన సురేశ్ (28) కలిసి రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు ద్విచక్ర వాహనాలపై ప్రయాణిస్తున్నారు. నిందితులపై విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులు ప్రయాణిస్తున్న వాహనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు చేశారు. ముగ్గురు నిందితులు సామగ్రి తరలించే సంచుల్లో రూ.10లక్షల చొప్పున మూడు వేర్వేరుగా రూ.30లక్షల నగదును తరలిస్తున్నారని గుర్తించారు. నిందితుల వద్ద ఎలాంటి రసీదు కాని, లావాదేవీలు నిర్వహిస్తున్నట్లు గుర్తించే ఎలాంటి పత్రాలులేవని వెల్లడించారు. నగదును ఎక్కడి నుంచి సేకరించారు.. ఎక్కడికి తరలిస్తున్నారనే సమాచారం సైతం అందించకపోవడంతో హవాలా నగదుగా గుర్తించామని ఇన్‌స్పెక్టర్ అయజ్‌కుమార్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న నగదుతోపాటు నిందితులను తదుపరి విచారణ నిమిత్తం రెయిన్‌బజార్ పోలీసులకు అప్పగించామని తెలిపారు.

## ద్విచక్ర వాహనంపై రూ.7.50లక్షలు తరలింపు

**స్వాధీనం చేసుకున్న పోలీసులు**



డబ్బు స్వాధీనం చేసుకొని వివరాలు ఇన్‌స్పెక్టర్ రామ్‌ప్రసాదరావు

వెంగళరావునగర్, అక్టోబర్ 28 : ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన వేళ ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రూ.7,50,000 నగదును ఎస్ఆర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పి.వి.రామ్‌ప్రసాదరావు కథనం మేరకు.. శనివారం ఎర్రగడ్డ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్-1(బి)అధికారులతో కలిసి ఎస్ఆర్‌నగర్ పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా కన్పించిన ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. దీంతో ఓల్డ్‌బోయిన్‌పల్లికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి ఎం.ప్రవీణ్‌కుమార్ ద్విచక్ర వాహనంపై నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించి సరైన వివరాలు చెప్పకపోవడంతో అతడిని అదుపులోకి తీసుకుని, నగదు స్వాధీనం చేసుకున్నారు.

## లాడ్జిలో రూ.7లక్షల నగదు పట్టివేత



సమావేశంలో మాట్లాడుతున్న మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు

మెహిదీపట్నం, అక్టోబర్ 28 : రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి మాసబ్‌ట్యాంక్ లాడ్జిలో రూ.7లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్‌రావు వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన సాబేర్ అలీ, మోసిన్ ఖాన్ నగరానికి వ్యాపారం నిమిత్తం వచ్చారు. వీరిద్దరు మాసబ్‌ట్యాంక్‌లోని సిటిటెల్ లాడ్జి రూం నంబర్.308లో దిగారు. శుక్రవారం రాత్రి మాసబ్‌ట్యాంక్‌లో పోలీసులు లాడ్జిలో తనిఖీలు నిర్వహించగా వీరివద్ద రూ.7లక్షల నగదు దొరికింది. దీంతో ఆ డబ్బులను స్వాధీనం చేసుకున్న పోలీసులు ఎన్నికల అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉన్నది.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బంగారం పట్టివేత



శంషాబాద్ రూరల్, అక్టోబర్ 28 : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో రూ.60లక్షల విలువైన బంగారం స్వాధీనం చేసుకున్న సంఘటన శనివారం జరిగింది. కస్టమ్స్ అధికారులు తలిపిన వివరాల ప్రకారం.. కౌలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన ప్రయాణికుడిపై అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు అతడిని పూర్తిస్థాయిలో తనిఖీలు చేశారు. దీంతో అతడు ఎవరికి అనుమానం రాకుండా ఫేస్ట్ రూపంలో 971 గ్రాముల బంగారం దాచుకొని తరలిస్తుండగా.. స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బంగారం రూ.60లక్షల ఉంటుందని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, అక్టోబర్ 28: ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్-ఎంసీసీ), జిల్లా గ్రీవెన్ కమిటీ, పోస్టల్ బ్యాలెట్, లా అండ్ ఆర్డర్, మీడియా మానిటరింగ్(ఎంసీఎంసీ), స్వీప్, శిక్షణ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల పరిశీలన బృందాలు తమ విధులను పకడ్బందీగా నిర్వహించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలు అక్రమ నగదు, బంగారం, ఆభరణాల ఉచిత పంపిణీని అరికట్టేందుకు ఈ బృందాలు కట్టుదిట్టంగా విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో ఎన్నికల ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సర్టిఫికేషన్ చేయనున్నట్లు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు డీఏవీపీ, డీఐపీఆర్ రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలను, ఏర్పాట్లను అధికారులకు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో జిల్లా నోడల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో రేవంత్‌రెడ్డిని ఓడిస్తాం

**దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్**




సమావేశంలో మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణస్వరూప్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 28 : రాష్ట్రంలోని దళితుల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి కొడంగల్ నియోజకవర్గంలో ఓటమి తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ శక్తిని పెంచుకునేందుకు రెడ్డి సామాజిక వర్గానికి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, రెడ్డిల ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు దళిత బహుజనులు కృషి చేయాలని కోరారు. పార్టీ ఫండ్ పేరుతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల నుంచి వసూలు చేస్తూ రేవంత్‌రెడ్డి కార్పొరేట్ వ్యాపారంగా మార్చివేశాడని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్రలను బహుజనులు ఐక్యతతో ముందుకు సాగి తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వేదవృత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీశ్‌కుమార్, ఎన్నికల కమిటీ చైర్మన్ డాక్టర్ వీ.ఎల్.రాజు, డిప్యూటీ చైర్మన్ జె.ఎన్.రావు, కోఆర్డినేటర్స్ దేవునూరి శ్రీనివాస్, ఎండీ హుస్సేన్, కరుణాకర్, సుబ్బారావు, మద్దెల ప్రవీణ్‌కుమార్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# డబ్బులు తీసుకున్నట్లు రుజువు చేస్తే రాజీనామాకు సిద్ధం

- **ఆరోపణలను ఖండిస్తున్నాం : కార్పొరేటర్లు**
- **మా బలం.. బలగం చూసి ఆందోళన చెందుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి**



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్లు

మల్కాజిగిరి, అక్టోబర్ 28: డబ్బులు తీసుకున్నట్లు చేస్తున్న ఆరోపణలను ముక్తకరంతో ఖండిస్తున్నామని కార్పొరేటర్లు సునీతారాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జగదీశ్ గౌడ్, ఆకుల నర్సింగరావు, సర్కిల్ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి, జేఏసీ వెంకన్న, రాము యాదవ్ అన్నారు. శనివారం మల్కాజిగిరి డివిజన్ ఆర్‌కేనగర్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు సునీతారాము యాదవ్, మీనాఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్పొరేటర్లకు, నాయకులకు చెప్పకుండా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగెస్ పార్టీలో చేరాడన్నారు. డబ్బులు తీసుకున్నారని చేస్తున్న ఆరోపణలను రుజువు చేస్తే కార్పొరేటర్ల పదవికి రాజీనామా చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. సీఎం కేసీఆర్ కార్పొరేటర్లుగా టికెట్లు ఇచ్చారని, పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డిని లక్ష మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ గెలిచి సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రి అవుతారన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల క్షేత్రంలో ప్రజలు నిర్ణయిస్తారని, డిపాజిట్ వస్తుందో రాదో తేల్చుకోవాలన్నారు. మా బలం బలగం చూసి హస్తం గుర్తు వారు బెంబేలెత్తి పోతున్నారని, బలవంతంగా కాంగ్రెస్ పార్టీలోకి నాయకులను చేర్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదన్నారు. మలాజిగిరి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అడ్డా అని, ప్రజలు అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.